క్లుప్తంగా

కబడ్డీ విజేత మామిడిపూడి



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారుడు

ముత్తుకూరు : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం తాళ్లపూడి–మామిడిపూడి మధ్య కబడ్డీ పోటీ హోరాహోరీగా జరిగింది. తాళ్లపూడి సచివాలయ పరిధిలో జరిగిన పోటీలో 23–14 స్కోర్‌తో మామిడిపూడి జట్టు విజేతగా నిలిచింది. మండల స్థాయి పోటీకి అర్హత సాధించింది. పీఈటీ మాధవ్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

వెంకటాచలం: దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం 8వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ఈ కేంద్రంలో దివ్యాంగులకు స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వైద్య సహకారం అందించేందుకు ప్రత్యేక చొరవ చూపుతామని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ ఎస్పీ మనోజ్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అక్బర్ అలీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకటశేషయ్య, జెడ్పీటీసీ పోట్లూరు సుబ్రహ్మణ్యం, ఆరుముళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఈనెల 5వ తేదీ నుంచి రాజమహేంద్రవరంలో జరుగనున్న తెలుగు మహాసభలకు పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. తెలుగు మహాసభలకు తనను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, వెంకటరత్నం సుధీర్‌కుమార్‌ను అభినందించారు.

జై భారత్ జిల్లా కోఆర్డినేటర్‌గా గాజుల సాగర్



గాజుల సాగర్

నెల్లూరు సిటీ: జై భారత్ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్‌గా గాజుల సాగర్‌ను నియమించి బాధ్యతలు అప్పగించినట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు జేడీ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ లక్ష్మీ నారాయణ యువతను రాజకీయంగా ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో తనకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. జిల్లాలో జై భారత్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాజనాల జయంతి

నెల్లూరు(బృందావనం): ప్రముఖ సినీనటుడు రాజనాల కాళేశ్వరరావు శత జయంతిని ఏవీకే ఫౌండేషన్ నిర్వాహకుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన రాజనాల తన విలక్షణ నటనతో నాలుగు దశాబ్దాల పాటు వివిధ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి మెప్పించారని తెలిపారు. అనంతరం 100 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

పుస్తకావిష్కరణ

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ మహిళా కళాశాలలో జువాలజీ, ఆక్వా కల్చర్ విభాగాల విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించిన ష్రింప్ ప్రాసెసింగ్ టెక్నాలజీ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ గిరి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌లో నేర్చుకున్న అంశాలతో జువాలజీ హెచ్‌ఓడీలు శ్రీరంజని, సీహెచ్ రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థిని మనోజ్ఞ 'ష్రింప్ ప్రాసెసింగ్ టెక్నాలజీ' పుస్తకాన్ని రచించి ఇంటర్నేషనల్ ఐఎస్‌బీఎన్ నంబర్‌తో ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకం విద్యార్థులతో పాటు ష్రింప్ పరిశ్రమలకు కరదీపికలా ఉపయోగపడుతుందన్నారు. జువాలజీ అధ్యాపకులు స్వాతి, పీఆర్వో జోజి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయురాలు సావిత్రీబాయి పూలే

వెంకటాచలం : నేటి తరం యువతకు సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలు అని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో సావిత్రీబాయి పూలే జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి వీసీ సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలన్నారు. భర్త సహకారంతో తాను నమ్మిన విలువల కోసం నిలబడి గెలిచిన తీరు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, కుట్టి కళాశాల ప్రిన్సిపల్ లతీఫ్ కుట్టి, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయానంద్‌కుమార్ బాబు, అధ్యాపకులు సి.శ్రీనివాసరామ్, సీహెచ్.విజయ, మధుమతి, కె.సునీత, విమల, సుచరిత, హనుమారెడ్డి, కుసుమకుమారి కుట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..

సరస్వతీనగర్‌లోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ సుందరవల్లి, సిబ్బంది

ఘనంగా..

పొదలకూరు : స్థానిక పూలే భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయ్ పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయ్ పూలే గొప్పతనాన్ని సంఘ నేతలు, ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ, నాయకులు తుమ్మల శ్రీనివాసులు, మస్తానయ్య, సోమా భాస్కర్, మాడా రాధాకృష్ణయ్య, పముజుల శంకరయ్య, వెంపులూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సావిత్రీబాయ్ పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ కలిసి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.శ్రీనివాసులు, జి.లక్ష్మీకల్యాణి, రావుల దశరథరామయ్యగౌడ్, సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆదర్శంగా తీసుకోవాలి

మనుబోలు : ప్రతిఒక్కరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ శేషాద్రివాసు తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మహిళల చదువు కోసం సావిత్రీబాయి పూలే నినదించారని తెలిపారు. మహిళల విద్య కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, రఘు, ప్రసాద్, డేనియల్, రవీంద్రనాథ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..



పొదలకూరు : నివాళులర్పిస్తున్న బీసీ నేతలు



పొదలకూరు : ఎంపీడీఓ కార్యాలయంలో..

ఆంధ్రప్రదేశ్‌లోనే రూ.3 వేల పింఛన్



మానసిక వైకల్యం కలిగిన చిన్నారికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : సామాజిక పింఛన్ రూ.3 వేలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో కేవలం రూ.500 మాత్రమే పింఛన్ ఇస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి విడతల వారీగా రూ.3 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలో కొత్తగా 117 పింఛన్‌లు మంజూరు కాగా, మొత్తంగా 6,854 పింఛన్‌లు ఇస్తున్నామని తెలిపారు. పింఛన్‌దారులు గుండెలపై చేయి వేసుకుని ఆలోచించాలని, అందరికీ మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. ఎవరూ అడగకపోయినా ప్రజల బాధలు తెలిసిన ముఖ్యమంత్రిగా జగనన్న 33 సంక్షేమ పథకాలను అమలు చేసి అందరినీ ఆదుకొంటున్నారని తెలిపారు. చంద్రబాబుకు తండ్రి నుంచి కేవలం రెండు ఎకరాల ఆస్తి మాత్రమే వచ్చిందని, ఇప్పుడు రూ.4 లక్షల కోట్లకు అధిపతి అయ్యారని తెలిపారు. ఇదంతా అక్రమంగా సంపాదించిన నల్ల డబ్బేనన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ ఎన్.ప్రతాప్, నాయకులు ఎన్.నాగేశ్వరరావు, నక్కా తిరుపతమ్మ, పొబ్బా రవి, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి రెండో విడత సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని దుగ్గుంట పంచాయతీ పెదరాజుపాళెంలో రేపు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. సాగునీటికి సంబంధించి కాలువల ద్వారా అవకాశం ఉన్న గ్రామాలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు విడుదల చేస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటారని, జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా కొత్తగా తాగునీటి ట్యాంకులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నేదురుమల్లి ఎంపీటీసీ సభ్యుడు పెంచలనాయుడు, వెలికంటిపాళెం సర్పంచ్ వెంకటరమణయ్య చెరువుల తూములకు షెట్టర్లు సక్రమంగా లేవని తెలపగా, జలవనరులశాఖ ఏఈ రవికుమార్‌రెడ్డి సమాధానమిస్తూ కలెక్టర్ రూ.10 లక్షలు మంజూరు చేశారని, పనులు చేపడుతామన్నారు. ఎంపీడీఓ నగేష్ కుమారి అజెండాలోని అంశాలను ప్రస్తావించి మండల స్థాయి అధికారులను వివరించాల్సిందిగా సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, పొదలకూరు సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, రావుల దశరథరామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

సంక్షేమ సారథిని ఆశీర్వదిద్దాం

కొడవలూరు : సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజయా డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి కోరారు. మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సచివాలయంలో గ్రామానికి మంజూరైన సంక్షేమ పథకాల వివరాలను బోర్డుపై ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పేదలు లేని రాష్ట్రంగా మార్చేందుకు సీఎం జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కత్తి కృష్ణమ్మ, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మేడ మల్లికిశోర్‌రెడ్డి, గాజుల మనోజ్, తమ్మిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఎస్కే మహబూబ్‌బాషా, తమ్మిరెడ్డి అనిల్‌రెడ్డి, శీను పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నేతలు

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంపుల ద్వారా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ జయంతి, నాయకులు సీతారామిరెడ్డి, భరత్, సురేష్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నేడు మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మండల పరిధిలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక పింఛన్ల పెంపునకు సంబంధించి రూ.3 వేలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కోడూరు పంచాయతీలో జరిగే పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ముత్తుకూరు : మండలంలోని నేలటూరు క్రాస్‌రోడ్డు వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లు దాచిన నాగరాజు అనే వ్యక్తిని సెబ్ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ దాడిలో సెబ్ ఇన్‌స్పెక్టర్ మొగల్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ బాబు సతీష్, కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12 బాటిళ్ల పట్టివేత


మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రఘురామయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో ఎస్సై అజయకుమార్ మంగళవారం రాత్రి తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



తోటపల్లిగూడూరు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను బుధవారం అందించారు. ఎన్‌డీఆర్ గ్రూప్స్ సంస్థల వ్యవస్థాపకుడు నాయుడు దశరథరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ప్రోత్సాహకాలు అందించారు.


శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు గావించారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ

కొడవలూరు : ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఎరువుల దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలు, వాస్తవ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీలో వ్యత్యాసం ఉన్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులొస్తే ఎరువుల నిల్వలు సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనులను సమర్థవంతంగా చేయాలి

మనుబోలు : ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆ పథకం ఏపీఓ రాజమ్మ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మేట్ల శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. ఉపాధి హామీ శిబిరాల్లో పనులు చేసే కూలీల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ–శ్రమ కార్యక్రమాన్ని కూలీలందరికీ అమలు చేస్తున్నామన్నారు. దీని వల్ల పనులు చేసే సమయంలో కూలీలు గాయపడినా రక్షణ ఉంటుందన్నారు. కూలీలను ప్రధాన మంత్రి బీమా సురక్ష పథకంలో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మండల పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించామని వివరించారు. కార్యక్రమంలో టీఏ సుప్రజ, ఎఫ్ఏలు హరేంద్రగౌడ్, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ రాజమ్మ

తపాలా శాఖలో సంక్షేమ పథకాలు

ముత్తుకూరు : తపాలా శాఖ ద్వారా ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నెల్లూరు ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలకు ఉపయోగపడే విధంగా పొదుపు చేసుకోవచ్చని సూచించారు. తక్కువ మొత్తంలో ప్రమాద బీమా చేసుకునే పథకాలు కూడా అమలవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే తపాలా శాఖలో దాచుకున్న సొమ్ముకు పూర్తి భద్రత ఉంటుందన్నారు. సబ్ పోస్టుమాస్టర్ కరుణాకర్‌రావు, బీపీఎమ్, ఏబీపీఎమ్‌లు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

మనుబోలు : విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ శేషాద్రివాసు సూచించారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని కాగితాలపూరు గ్రామంలో తలపెట్టిన ఎన్‌ఎస్ఎస్ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అవలంబించాలన్నారు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం, అంకితభావం ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ కాగితాలపూరు గ్రామంలో ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు ఎన్‌ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, హనుమంతరావు, మల్లికార్జునరావు, శరత్‌బాబు, విజయ్‌కుమార్, రమేష్, లైబ్రేరియన్ శారద, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శేషాద్రివాసు

సకాలంలో ఎరువులు అందేలా చర్యలు

కోవూరు : రైతులకు సకాలంలో ఎరువులు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు సుజాత పేర్కొన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయాధికారులతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణాల ముందు స్టాక్ వివరాలు పొందుపరచాలని తెలిపారు. రోజువారీ అమ్మకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఓలు ఇందిరావతి, కృష్ణయ్య, లక్ష్మి, సురేంద్రరెడ్డి, ప్రయోగశాల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి శైలజకుమారి, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సుజాత

భక్తిశ్రద్ధలతో అక్షతల శోభాయాత్ర



కోవూరు : అయోధ్య అక్షతల శోభాయాత్ర



కోవూరు : కోలాటం చేస్తున్న మహిళలు

కోవూరు : స్థానిక కోదండరామస్వామి ఆలయానికి వచ్చిన అయోధ్య అక్షతలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటం, మంగళ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర గావించారు. స్థానిక రామాలయం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్, బీజేపీ నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షతల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని హరివిల్లు లేఅవుట్ కాలనీలో కల్యాణ్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షతలను బుధవారం ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనంతమ్మ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అక్షతల అందజేత